# వజ్రం

వి. ప్రతిమ

మూసుకు పోతోన్న మబ్బుల చాటున ఉదయచంద్రుడు తన కాంతిని కోల్పోతున్నాడు క్రమంగా... పడమటి దిక్కునుండి వీస్తోన్న ఈదురుగాలులతో వాకిట్లోని అశోక చెట్లు దెయ్యం పట్టినట్లుగా తలలూపుతూ కదలాడుతున్నాయి. గుమ్మం ముందు కోయకుండా వదిలేసిన పసుప్పచ్చ బెంగులూరు రోజా పువ్వుని నల్ల బర్రె దూడ కసకసా నమిలి మింగుతోంది.

"బదన బతుకు... బదన బతుకని.. ఒక్కనాటికీ తెగేట్టులేదు ఈ బదన... ప్చ్" నలభయ్యేళ్ళ సాంసారిక జీవితంలో ఈ మాట రోజులో ఒక్కసారయినా అనుకోకుండా వుండేది కాదు వజ్రమ్మ... కానీ ఈరోజు ఆ మాట అనుకోడానిక్కూడ యోచన లేనట్లు నిరామయమైపోయిందామె...

బతుకుబండి ఎవరికయినా గతుకుల్లో పడ్డం, లేవడం సహజమవచ్చునేమో గానీ వజ్రమ్మ బతుకు బండికింద పడ్డవి గతుకులు కాదు గుంటలు లోయలు.. అయితే యిటువంటి లోయ ఒకటియింకా ఈ మునిమాపువేళలో కాచుకుని వుంటుందని కలలో కూడ వూహించలేదామె...

"క్యైక...క్యైల్" మంటూ సన్నగా వెక్కిళ్ళు... దుర్భరమైన దుఃఖాన్ని పెదవిచాటున భరిస్తున్నట్లుగా వినీవిన్పించకుండా రోదన...

పడమటింట్లో చీకట్లో ముడుచుకుని పడుకుని వున్న వజ్రమ్మ గుండె వుండుండీ వేగంగా కొట్టుకో సాగింది... ఎవరయినా వచ్చారా?.... అప్పుడే అందరికీ తెలిసి పోయిందా? మంచి విషయాలయితే తెలియడానికి ఆలస్యమవుతుందేమో గానీ యిటువంటివి నిప్పులా రాజుకుంటాయి...

ఎక్కిళ్ళు పెడుతోన్న శ్రీదేవిని గుసగుస మాటల్తో ఓదారుస్తున్నట్టున్నాడు అల్లుడు... డెబ్బైయి రెండు గంటల్నుండీ కంటిమీద రెప్పపడకుండా భోరున కురుస్తోన్న వాన మాదిరిగా యాడస్తానే వుందాయమ్మి.. ఎవురు ఎవుర్ని ఓదార్చగలరు. పైకి లేవాలంటే కళ్ళూ, మొహం తిరిగినట్లుగా వుంది వజ్రమ్మకి...

మూడురోజులుగా తను కన్పడకపోవడంతో బర్రెలూ, ఆవులూ ఎలుగెత్తి 'అంబా' అంటూ అరుస్తున్నాయి.... వాటికి తెలీదు యింట్లో జరగరాని ఘోరమొకటి జరిగిపోయిందని ... అలా పెద్దగా అరవకూడదనీ .... మూగజీవులు వాటికి పరువూ మర్యాద ... అవిపోవడమూ, రావడమూ అంటూ వుండదు... మనుషుల క్కూడా యివన్నీ లేకుండా వుంటే ఎంత బావుణ్ణు...

చిన్నకొడుకు భాస్కరరెడ్డి గావాల ఎవరూ చూడకుండా సందుతలుపు తీసుకొనివెళ్ళి పశువులన్నింటి ముందరా గడ్డివేసి నీళ్ళు పెట్టినట్టున్నాడు. కాసేపటికి అవి అరుపులు చాలించాయి... నిద్రపోతుంటాయి బహుశా ... తనకి కూడా అంత హాయిగా నిద్రపడితే ఎంత బావుంటుంది...

గుండెల్లోకి ఏదో ఎగదన్నుకొస్తున్నట్లుగా అన్పించి మెల్లిగా లేచి కూర్చుని వూపిరి పీల్చుకుంది... కాసేపాగి పక్కకి ఒరిగి పడుకుంది మళ్ళీ...

ఇంట్లోవాళ్ళకి మౌనభంగం చేయడానికిష్టం లేనట్లుగా కనెక్షన్ పెరికేసిన ఫోన్ వైర్లు నిశ్శబ్దంగా కదలాడుతున్నాయి గాలికి... ఈదురుగాలికి భయపడో, చంద్రుడు కన్పించలేదని ఖేదపడో మామిడికొమ్మమీది కోయిల అపభ్రంశ స్వరంతో నిరంతరాయంగా కూస్తునే వుంది. ఎందుకో గాని యివ్వాళ మావి చివుర్లు సహించినట్లుగా లేవు దానికి.

ఎన్నడూ లేని ఈ కోయిల అపభ్రంశపు కూతలకి పక్కింటి కుక్క మొరుగుతూనే వుంది ఆపమన్నట్లుగా ...

బయటి ప్రపంచంతో తమ యింటికి సంబంధం తెగిపోయినట్లుగా అన్పించింది వజ్రమ్మకి... ఊరు యిట్టయి పోయిందేందో మరీ.... ఇంతకు ముందు ఒకరింటికి బంధువులొస్తే వూరంతటికీ చుట్టాలే... ఒక యింట్లో మరణమొస్తే లేదా చిన్న కష్టమొచ్చినా సరే... వూరంతటికీ దుఃఖమాగేది కాదు...

ఇప్పుడెవ్వరికే మొచ్చినా సరే నీకేమి నాకేమన్నట్లుగా అయిపోయింది... ఎవురికీ తీరికలేదు.... ఒకవేళ వచ్చినా మునిమాముల విచారింపులే.. ప్చ్ అసలు విషయాన్ని మర్చిపోవడం కోసమన్నట్లుగా వేరే వేరే ఆలోచనలలోకి వెళ్ళిపోయినట్లుగా వుంది వజ్రమ్మ....

✤ ✤ ✤

"ఏమైనా కాఁయిప్పుడు బావగాని వుండుంటే కొడుకుల కింత పవరొచ్చి వుండేది కాదు... యాడుండే వాళ్ళాడ వుండుంటారు.. తప్పో ఒప్పో అయింది... పోయింది... అంతటితో గమ్మనుండకుండా వీళ్ళకింతింత ఆవేశాలేంది? కావేషాలేంది? అంటూ గనిసింది కౌసల్య.. వజ్రమ్మ పిన్నమ్మ కూతురు... పేపర్లో విషయం చూసి వచ్చిందట... అక్కని ఎలా ఓదార్చాలో తెలీక ఏదో ఒకటి మాట్లాడాలన్నట్లుగా అన్నది.

చెరుకు తోటలో పాము కరిచి అర్ధాంతరంగా మరణించిన భర్త కట్టెదుట నిలిచాడు వజ్రమ్మకి... ఒకసారేదో అతనితో మాటామాటా వచ్చి తను భరించలేక కిరసనాయిలు తలమీద పోసుకుంది.... బెదిరించడానికో నిజంగానే విరక్తి కలిగిందో తనకింకా జ్ఞాపకం వెంటనే అతడు జేబులో నుండి అగ్గిపెట్టె తీసి తనమీదికి విసిరేసి "కాల్చుకోవేకాల్చుకోఁ నిన్నెవరూ ఆపరిక్కడ" అంటూ తలుపుల బయటగడియ వేసుకొని వెళ్ళిపోయాడు.... ఆ కాళరాత్రిని బతుకు చరిత్రలో నుండి తుడిపేయగలదా తను ... అటువంటి కాళరాత్రులు మరెన్ని మిగిలి వుండేవో అతడు బతికి వున్నట్లయితే ... అతడు పోయాక

ముప్పయ్యేకరాల పొలాన్ని, పసికందులయిన కొడుకుల్ని... వయసుకు రాడానికున్న కూతుర్నీ ... తనకున్న మంచి వయసునీ కాపాడుకుంటూ ... కొడుకులకు చదువులు చెప్పించి... శ్రీదేవికి మంచి సంబంధం చూసి పెళ్ళి చేయడానికి తన చావు తన కళ్ళచూడాల్సుంది వజ్రమ్మ.

పెద్దకొడుకు జగన్‌మోహన్‌రెడ్డి డిగ్రీ చేసి వుద్యోగం దొరక్క వ్యవసాయం మొదలుపెట్టాడు.... అదీచేతకాక తన వంతు పొలాన్నమ్ముకుని పేటలో వ్యాపారం మొదలుపెట్టాడు... భార్య ఒక్కతే కూతురు కావడంతో అత్తగారి వైపు నుండి కూడా ఆసరా లభించింది. ... రెండోవాడు శ్రీకాంత్ ఇంజనీరింగ్ పూర్తిచేసి మంచి ఉద్యోగంలో స్థిరపడ్డాడు... పెళ్ళి కూఢా చేసుకుని హైదరాబాద్‌లో కాపురం పెట్టి వజ్రమ్మకు దూరపు చుట్టమైపోయాడు. మూడో కొడుకు భాస్కర్ టెన్త్ వరకూ చదివి వ్యవసాయంలో తల్లికి చేదోడు వాదోడుగా వుంటున్నాడు...

"అయినా ఈ శనిబట్టిన ముండ కూడా అట్నే చేసిందిలే.. మేనమామలు లక్షణంగా వుండాలి కదా వీరుల మాదిరిగా ... ఎట్టాటి రాకుమారుడ్ని ఎతికి తెచ్చుందురో... యింతలోపల్నే యింత తీపరమా...?" కౌసల్య వూర్నుండి రావడం చూసి పక్కింటి లలిత కూడా వచ్చి కూర్చుంది.... కూర్చున్న దగ్గర్నుండి మూడు రోజులుగా తనూ, తన భర్త ఎంత మదనపడిందీ ... వజ్రమ్మ ముఖం చూడల్యాకనే రాలేదనీ కౌసల్యతో సంజాయిషీలు చెప్పసాగింది.... వజ్రమ్మ యిబ్బందిగా యింకా ముడుచుకొని పడుకుంది. ... పడమటింటి గుమ్మం ముందు గోడకానుకుని కూర్చునివున్న శ్రీదేవి మోకాళ్ళలో తలదూర్చి వెక్కి పడుతోంది..

"ఎందుకమే ఏడ్చేది? .... నువు చెయ్యాల్సిందంతా చేసినావు ఒక్క బిడ్డని మొన్న యిరవై సవర్లకి వడ్డాణం చెయించుకొచ్చి పెడ్తివి.... గాజులు చెయ్యిస్తివి .... ఆయమ్మికి గతిల్యా అంతే..." అది ఓదార్చడమో ... ఎక్కెయడమో తెలీనట్లుగా చెప్పిందిలలిత...

'మన యిలాకాలోనే ల్యాకపాయ యిట్టాటి పని ... ముంగిమాదిరి ఏవీఁతెలీనట్టుగా వుణ్ణిందిమా ... ఆ పిల్లను చూస్తే యింత పని చేస్తాదనుకుంటామా? ఎంత కడుపుమంట పెట్టిపోయిందిమా నీకు?.... ఒకనాటి కష్టాలు కాకపాయ ఎట్టకోలుకో బోతావో ఏమొ...." పాతెమ్మ వజ్రమ్మకి చిన్ననాటి స్నేహితురాలు .... ఫాతిమాబీ అయితే అంతా ఆమెని పాతెమ్మ అనిపిలుస్తారు. నీలిమ చేసిన పని ఒకింత ఆలస్యంగా పాతెమ్మ చెవిని పడింది.... తెలీగానే కొడుకూ, కోడలూవారిస్తున్నా వినకుండా కర్రతాడించు కుంటూ వచ్చింది. కుప్పకూలిపోయిన వజ్రమ్మని, కంటికి కడివెడుగా ఏడుస్తోన్న శ్రీదేవినీ ఓదార్చడానికి....

జగన్మోహన్‌రెడ్డి భార్య సుమతి అందరికీ కాఫీలందిస్తోంది... "ఫోను చేసినాడా అబయ్య" హీనస్వరంతో పక్కవాళ్ళకి వినపడకుండా అడిగింది వజ్రమ్మ....

అత్తని చూస్తుంటే కడుపులో తిప్పినట్లయింది సుమతికి.... నిప్పులాంటి మనిషి ... మాటకోసం, పరువు కోసం ప్రాణాలయినా యివ్వడానికి సిద్ధంగా వుంటుంది. కొడుకుల్ని కూడా అట్టనే పెంచుకొచ్చింది. ఆమాటకొస్తే మనవరాలు నీలిమ కూడా అమ్మమ్మ దగ్గరే పెరిగి హైస్కూలుకొచ్చేటప్పటికి తల్లి దగ్గరికెళ్ళింది... ఆ తర్వాత డిగ్రీ చదువు పేటలో మేనమామ యింట్లో వుండి చదువుకునేది....ఆ రోజు కూడా మామూలుగానే లేచి కాలేజీకి బయల్దేరింది... మొన్న పుట్టిన్రోజుకి కొన్న కొత్త డ్రెస్ వేసుకుంది..

"రోజూ మాదిరే కాలేజీకి బయల్దేరింది... యింత కడుపులో పెట్టుకుని పోతుందనుకోల్యా... నాకయితే వాళ్ళ మామకేం చెప్తాన్రా దేవుడాఅని వణుకు పుట్టిపోయింది" ఆ రోజు సంఘటనని పదేపదే గుర్తు తెచ్చుకుంటూ అన్నది సుమతి... మూడు రోజులుగా మంచానికంటుకుపోయి ఈ రోజు పొద్దున్నే పేట నుండి వచ్చిందామె...

"అయినా ఆ పాపిష్టోడు యాడ్నుండి దూకినాడు? ... ఎట్ట పరిచయమైనాడు బిడ్డకి మిడిమాలపోడు.... పాలు, పెరుగు, వెన్న, ఆపిలు పండ్లతోనే పెంచుకుంది వజ్రక్క. ఆ మాదిగ నా బట్ట కోసమే గావాల "అప్పుడే వచ్చినట్టుంది సుబ్బులమ్మ... బయట్నుండే పెద్ద గొంతుతో మాట్లాడుతూ "నాకాడ ఆరిమేనిపొట్లో తెల్సింది కాఁ పేపర్లలో ఏసినారంటనే... ఆడందురూ చెప్పుకుంటుంటే యిని పరిగెత్తినా.. ఎండా మాటా గూడ జూళ్ళే.... "నేరుగా వంటింట్లోకి వెళ్ళి నీళ్ళు ముంచుకుని తాగి వొచ్చి వజ్రమ్మ పక్కన కూర్చుంది.

సుబ్బులమ్మ మాటలకే అని కాదు గానీ... ఎందుకో దుఃఖం పొంగుకొచ్చిది వజ్రమ్మకి ... అంతాఒక్కొక్కరూ వాళ్ళకి తెలుసో, తెలీకో ఓదార్పు మాటలు చెప్పబోయి జరిగిన సంఘటనని పదే పదే గుర్తుచేస్తున్నారు. మానని పచ్చిపుండు మీద చీమలు పారాడుతున్నట్టుగా, సూదులతో గుచ్చుతున్నట్లుగా వుంది పరిస్థితి..." దీర్ఘంగా నిట్టూర్చి మళ్ళీ కళ్ళు మూసుకుంది వజ్రమ్మ.

"అట్టకాదులే సుమతక్కాఁ...జగనన్న రాజకీయాల్లో ల్యాకుండా వుంటే యిది యింతవరకూ వచ్చి వుండదు.... అన్న జడ్పీటిసిగా నెలనెలా జడ్పీమీటింగులకి పోవాల్సొచ్చే... పేపర్లలో ఏసి యింత అగుడు చేసేస్తిరి. జిల్లా నాయకుడుకా అన్న... ఆడ ఎట్ట తలెత్తుకుంటాడు చెప్పు.... అన్న ఆవేశపడ్డంలో తప్పుల్యా .... ఆయన పరిస్థితది... ఆ పొజిషన్లో వుండేవోళ్ళు ఎవురయినా అట్నే చేస్తారు. ..." చెప్పాడు మునిరామయ్య జగన్మోహన్‌రెడ్డిని సమర్ధిస్తూ....

'అపాచి' బూట్లకంపెనీ వచ్చి ఈ చుట్టుపక్కల నేలలన్నీ చుక్కలు చూసినపుడు తల్లికిష్టం లేకపోయినా తనవాటా భూమిని అమ్ముకుని కొంత వ్యాపారంలోనూ మరికొంత రాజకీయంలోనూ పెట్టాడు జగన్‌రెడ్డి.... గత సంవత్సరం జరిగిన స్థానిక ఎన్నికల్లో జడ్పీటిసిగా గెలిచి జిల్లానాయకుడయి పోయాడు....

నీ కేమమ్మమ్మాఁ నీ కొడుకుల్లో ఒకరు రాజకీయ నాయకుడు, ఇంకొకరు ఇంజనీరు... మూడో ఆయన గొప్ప రైతు ... ఇక నుండి నువ్వు పాతచీరలు కట్టొద్దమ్మమ్మా... మావయ్యలకు అవమానం.... "నీలిమ మాటలు గుర్తొచ్చి మళ్ళీ దుఃఖం పొంగింది వజ్రమ్మకి...

రెండేళ్ళ ముందు భాస్కర్ చిన్న కొడుకు వాకిట్లో నిలబెట్టిన ట్రాక్టరు మీదెక్కి ఆడుకుంటూ కిందపడి తలపగిలి చచ్చిపొయ్యాడు. ... అప్పుడేడ్చింది వజ్రమ్మ గుండెలు పగిలేలా ... మళ్ళీ యిపుడు అదే దుఃఖం. గుండెలు బాదుకోవడానిక్కూడ వీల్లేని స్థితి.... చిన్న కోడలి మాదిరిగా తనక్కూడా పిచ్చెక్కి పోతే బావుణ్ణనిపించిందా మెకి. కొడుకు ట్రాక్టర్ మీది నుండి పడి మరణించిన్నాటి నుండీ భాస్కర్ భార్య ఒక అయోమయ ప్రపంచంలోకి వెళ్ళిపోయింది... ప్రస్తుతం శ్రీకాంత్ యింట్లో హైదరాబాద్‌లో ఉండి డాక్టరుకు చూపించుకుంటోంది.

"జగనయ్యఫోన్ చేసినాడా?" అడిగింది కౌసల్య సుమతిని పిలిచి.... గుసగుసగా వెక్కిళ్ళ నాపి వదిన మరదలి కేసి ఆత్రుతగా చూస్తోంది శ్రీదేవి.

ఇంట్లో ఫోన్ కనెక్షన్ పీకేశారు. సుమతి సెల్ మోగినప్పుడల్లా అంతా ఆమె చుట్టూ చేరుతున్నారు.

'చెయిలేదత్తా ... అందరికీ అదే భయంగా ఉంది... ఆడేం జరిగిందో తెలీడంల్యా..." సుమతిక్కూడా భయం భయంగానే వుంది...

పడమటింట్లోనే మెల్లిగా లేచి కూర్చుని గోడకానుకుంది వజ్రమ్మ. ఈసారి సుమతి తెచ్చిచ్చిన కాఫీ వద్దనకూడా వూదుకొని తాగింది. ... మూడు రోజులుగా ముడుచుకుపోయి అట్టలు కట్టిన జుట్టుని వేళ్ళతోనే సరదీసి సరదీసి ముడేసుకున్నది...

మూలగదిలో నులకమంచం మీద బోర్లా పడుకునివున్న యింటల్లుడు మాధవరెడ్డి దిగజారిపోయిన గుండెను ఎగదీసుకుంటూ అందరి మాటలూ, భార్య ఎక్కిళ్ళు వింటూనే వున్నాడు...

పైకి అంతా ఓదార్పు పంచుతూ, భోళా ధైర్యాలు మాట్లాడుకుంటున్నారే గానీ నీలిమని వెతకడానికి తన బృందంతో వెళ్ళిన జగన్‌మోహన్ రెడ్డి ఆ పిల్లని బతకనివ్వడని అందరికీ తెలుసు... నరికి పారేస్తానంటూ కత్తెత్తుకుని బయల్దేరాడతడు.

"ఈ దెబ్బతో జగన్‌రెడ్డి రాజకీయం సంకనాకిపోతాదని" ఊళ్ళో గిట్టని వాళ్ళంతా నరకసుఖాన్ననుభవిస్తున్నారు... జగన్‌రెడ్డికి పోటీవేసిన ప్రతాపరెడ్డి చంకలు గుద్దుకుంటున్నాడు... జగన్‌రెడ్డి జైలుకెళితే చూడాలనిఆత్రుతగా వుందతడి వర్గానికి...

'ఏ నిమిషానికి ఏమి జరుగునో ఎవరూహించెదరూ..

విధి విధానమును తప్పించుటకై ఎవరు సాహసించెదరూ" తమ యింట్లోని టి.విలో నుండి పెద్దగా విన్పిస్తోన్న పాత సినిమా పాటని లలిత గబాగబా వెళ్ళి ఆపొచ్చింది.... టి.వి. అంత పెద్ద సౌండ్లో పెట్టినందుకు పిల్లల మీద రంకెలు కూడా వేసొచ్చింది.

"మనమ్మిమెందుకు నరుక్కునేది?....ఆనాబట్టని నరికేసి జైలుకెళ్తే గూడ శాశ్వతంగా పేరు నిల్చిపోవాల.... ఇంట్లో వుండే పిల్లను ఈడ్చి యీదిలో పెట్టేసినాడు... ప్రేమ, దోమ అంటా ఎంటబడి బుజ్జమ్మ బతుకే నాశనం చేసేసినాడు.... వోడ్ని నరకాల ముందు సుబ్బులమ్మ ఆవేశం పట్టరాకుండా వుంది....వదిలితే వెళ్ళి నీలిమని లేపుకుపోయిన వెంకటరమణని కత్తికో కండగా చీరేసి వచ్చేలా వుంది...

"ష్ సుబ్బులమ్మా ... ఆ పిల్లోడిదే మొత్తం తప్పని ఎట్టంటాము... మనమ్మాయికి తెలివుండాల.... నువ్వు మాటమాటకీ కులం పేరెత్తబాక కేసులవతాయి గమ్మునుండు ... జగనన్న పొయ్యుండాడు కదా" వారించాడు అబ్దుల్లా.

"యాందినా కేసులయ్యేది? .... పోతే పోనీ ... బొక్కలో దోస్తారు గావాల నన్ను ..." రెచ్చిపోయింది సుబ్బులమ్మ.

మౌనంగా ఆలోచనలోపడ్డాడు అబ్దుల్లా.

అబ్దుల్లా కొడుకు రఫీ ఇంజనీరింగ్ చదువుతూ ఈ మధ్య ఒక ఎస్టీలమ్మాయిని పెళ్ళి చేసుకొచ్చాడు....అప్పుడు వజ్రమ్మ అబ్దుల్లాకి సర్ది చెప్పింది.

"వాడిష్టపడ్డాడు...ఇప్పుడంతా కలిసి పోతుండారు పో అబయ్యా మాలేంది మడికేంది?.... కులాలేంది మతాలేంది?.... పిల్లబాగుంది మీతో కలిసి పోతే చాలు....." అంటూ ప్రోత్సహించింది.

వజ్రమ్మ చెప్పినట్లుగానే కొడుకునీ, వాడు ప్రేమించిన సత్యబాలనీ యింటికి తీసుకొచ్చి తమ మతంలోకి అమ్మాయిని

మార్పించి పెళ్ళి జరిపించాడు అబ్దుల్లా ... మతం మారడానికి అమ్మాయి యిష్టపడిందో లేదా ప్రేమించిన అబ్బాయి కోసం తప్పనిసరనుకుందో గానీ సత్యబాల సపూర బేగంగా మారి పొయ్యింది.

ఎందుకనోగాని అప్పుడు వజ్రమ్మ నొచ్చుకుంది మతం మార్చిడికి.

ఇప్పుడదంతా గుర్తొచ్చి

"వేరే వాళ్ళకయితే చెప్పావు పెదమ్మా.... ఇప్పుడు నీ దాకా వస్తే తట్టుకోల్యాకుండా వుండావు...." అంటూ అబ్దుల్లా ఎత్తిపొడుస్తున్నట్లుగా అన్పించింది వజ్రమ్మకి ... అబ్దుల్లా తనకొడుకుని హరిజనవాడకి ఎట్టి పరిస్థితుల్లోనూ పంపించడు... సత్యబాల తల్లిదండ్రులు ధాటిగా అబ్బుల్లా యింటికి రావడానికి లేదు ... బయట్నుండో,,,,, బజార్లోనో కూతుర్ని చూసుకుందామంటే అబ్దుల్లా యింటి ఆడవాళ్ళకి గోషా.....

నిజానికి వజ్రమ్మకి ఈ కులాలు, మతాల పట్ల ఎప్పుడూ పెద్ద పట్టింపు లేదు... కాస్త చదువుకున్న వాడు, మంచిచెడ్డా తెలిసిన వాడయితే చాలు ... ఇప్పుడామె బాధంతా కొడుకేం చేస్తాడోననే....

" ఈ రాజకీయాలు సగం చెడిపినాయి.... చిన్న దానికి పెద్దదానికి విలేకర్లు యింటికొచ్చేది .... మాట్లాడిపొయ్యేది.... ఫోటోలనేది, పాస్ ఫోటోలనేది అదేదో లోకల్ పేపరు విలేకరంట... పెళ్ళకూర్లో వుంటాడు.... సదువుల్యా ... సంధ్యాలే... నీలిమమ్మ కంటే తక్కవే చదివినాడంట.... " ఎవరెవరో గుసగుసగా చెప్పుకుంటొన్న మాటలు చెవిదాకా పాకాయి...

కడుపు చించుకుంటే కాళ్ళ మీద పడుతుందని మింగలేక, కక్కలేక అల్లల్లాడి పోతోందామె మనసు... బిడ్డని చంపుకోవాలని లేదు. అట్టని కొడుకునెదిరించలేదు....

"ఖర్మగాకపోతే మరేందిలే... మేనమావలు ఎంత ముద్దుగా చూసుకుంటున్యారు.... ఈ నడవ గొప్ప ఇంజనీరు సంబంధ మొచ్చింది... ఆ పిలగాడిది నెల్లూరు... బెంగుళూరులో పని చేస్తుండాడంట... అరవైవేలు జీతం సంవత్సరానికి గాదు... నెలకి .... రేపు నెల్లో నిశ్చితార్ధమని కూడా అనుకున్నారు. ఇంతలోపల్నే యింత పనైపోయింది... ప్చ్"....

"శనిబట్టిన ముండ ... శనిబట్టినముండని...." లోలోపలే గొణుక్కుంది కౌసల్య ... ఒకప్పుడు అంతా వజ్రం ... వజ్రం లాంటి పిల్ల అంటూ పొగిడిన నీలిమని యిప్పుడు చుట్టాలంతా కూడా రకరకాలుగా అనుకుంటున్నారు. జగన్‌రెడ్డి నీలిమని నరికి తీసుకొస్తేనే బావుండునన్నట్లుగా వుంది వాళ్ళ ధోరణి...

పొద్దుట్నుండీ పొయ్యే వాళ్ళుపోగా వచ్చేవాళ్ళు వస్తున్నారు. అంతాకూడా చెప్పిందే చెప్తూ.... మాట్లాడిందే మళ్ళీ మళ్ళీ మాట్లాడు కుంటున్నారు....

సుమతి ఫోన్ మోగగానే అంతావాకిట్లోకి పరిగెత్తారు... జగన్ రెడ్డి కాదని తెలిసి తిరిగి వచ్చి కూచున్నారు... మళ్ళీ వెంటనే ఫోను మోగడంతో అంతాకాదు కానీ ఒకరిద్దరు మాత్రం సుమతి వెంటపడ్డారు.

మాట్లాడ్డం పూర్తయ్యాక సుమతి మెల్లిగా వచ్చి వజ్రమ్మ పక్కన కూచుంది. ... ఎట్లా చెప్పాలో తెలీక కావొచ్చు మౌనంగా తన చేతిలోని సెల్‌ఫోన్‌ని అటూ, ఇటూ కదుపుతోంది.... ఏమని అడిగితే ఏం వినాల్సొస్తుందోనని ఎలవరపోయినట్లుగా చూస్తోంది వజ్రమ్మ కోడలి కేసి.... అసలే ఛామన ఛాయలో వున్న వజ్రమ్మ ముఖం మరింత కమిలిపోయి ముడతలు బారినట్లుగా వుంది. నాలుగు దినాల్నుండి నీళ్ళను కార్చి కార్చి తడిని కోల్పోయిన కళ్ళు నిర్జీవంగా వున్నాయి... నీరసించి పోయిన గుండె "ధడ్ ... ధడ్ .... " మంటూ పైకే చప్పుడు చేస్తోంది....

నీలిమ వెళ్ళకముందు స్నానం చేసి కట్టుకున్న లేతరంగు వెంకటగిరి చీర మాసి మరగడమై వజ్రమ్మని శపిస్తోంది.

"శ్రీకాంత్ గూడా వచ్చినాడంట హైదరాబాద్ నుండి ... నెల్లూరవతల కావిలి కాడ ఏదో చిన్న వూళ్ళో దొరికినారంట..." అంటూ ఆపింది సుమతి...

వజ్రమ్మ దీర్ఘంగా వూపిరి పీల్చుకుంది... శ్రీకాంత్ వున్నాడంటే పక్కన అన్నకి కొంత ఆసరా అన్పించిందామెకి.... ఆ తర్వాత ఏం జరిగిందోనని అంతా ఆత్రుతగా సుమతికేసి చూస్తున్నారు. .... ఫోన్ శబ్దం విని యింట్లో, బయటా కూర్చున్న వాళ్ళంతా వజ్రమ్మ వద్దకి చేరుకోసాగారు... మాధవరెడ్డి కూడా నీరసంగా లేచి వచ్చి గుమ్మం వద్ద నిలబడ్డాడు.

"ఏం చెప్పినాడమ్మే?" సుమతి తండ్రి త్వరగా చెప్ప మన్నట్లుగా గదమాయించాడు కూతుర్ని.... తన కూతురింట్లో నుండి నీలిమ ఒకపనికిమానిలోడితో వెళ్ళిపోవడం.... రాజకీయంగానూ, వ్యాపారపరంగానూ ఎత్తుకు ఎదుగుతోన్న అల్లుడి పరువు మీద వేటు పడ్డం... యిదంతా అతడికి చాలాచిరాగ్గా ఉంది..... వూళ్ళో ఎవరూ మాధవరెడ్డి కూతురనుకోవడం లేదు. జగన్‌మోహన్ రెడ్డి మేనకోడలనే చెప్పుకుంటున్నారు... అదీ ఆయన చిరాకు...

"మాట్లాడుతుండారంట నాయినా పోలీస్‌స్టేషన్లో ... ఎస్పీ కాడుండారంట..." సుమతి కూడా విసుగ్గానే అన్నది...

"ఎందింకా మాట్లాడేది? పక్కింట్లోవుండే శంకరెడ్డి సుమతి తండ్రితో అంటున్నట్లుగా అన్నాడు.... ఇది రెడ్ల కుటుంబాలన్నింటి

మీద పెద్ద దెబ్బ అని అతడి వుద్దేశం... చంపడమో, చావడమో యివి రెండే పరిష్కారాలని అతడి ఆలోచన... గొణుక్కుంటూ మళ్ళీ బయటకి నడిచారిద్దరూ...

మిగతావాళ్ళు కూడా ఏమీ జరగనందుకు బాధపడ్తున్నట్లుగా గుసగుసగానూ, ఒక్కొక్కరుగానూ విడిపోయారు...

చూస్తుండనే సూర్యుడు గూట్లోపడ్డాడు....

సుబ్బులమ్మ బయటి వాళ్ళతో, వీళ్ళతో మాట్లాడి మెల్లిగా వజ్రమ్మ దగ్గరగా వచ్చి కూర్చుంది.

"మనమ్మిని తొడకొచ్చేయమనండి... వోడెట్టన్నాబోతాడు వోడ్ని నరికితే మనకేమొస్తది..." ఏదో ఆలోచించుకున్న దానిలా సుమతిని చూస్తూ అన్నది... తన సలహా చాలా గట్టిదని ఆమె నమ్మకం....

పేటలో మహిళామండలి నడుపుతున్న సుబ్బులమ్మ చేతికింద చాలా మంది ఆడవాళ్ళున్నారు.... జగన్‌రెడ్డికి రాజకీయంగా మంచి సపోర్ట్ సుబ్బులమ్మ... ఏచిన్న అవసరమొచ్చినా ఆడోళ్ళందర్నీ తీసుకొచ్చేస్తుంది .... పోరాటంచేస్తుంది... ధర్నాలకు దిగుతుంది.... మొత్తానికి సుబ్బులమ్మ గుండె పిడికిలంతేం కాదు....

"వోడితోనే పోతానంటుండాదంట... మనింటికి రాదంట.... వాడు కావాలా? మేనమామలు కావాలా అని అడిగితే వాడే కావాలని చెప్పిందంట మేజరయిపాయ...." గుసగుసగా అన్నది సుమతి సుబ్బులమ్మకి మాత్రమే విన్పించేట్లుగా....

"అయినా ఈ కాలం పిలకాయలు బరితెగించి పొయ్యుండారు.... అట్ట టవున్లల్లో పోయి చూడుబో... యాడబట్టినా జంటలు జంటలుగా సిగ్గిడిచేసి తిరగతుండారు........ యాం కాలోజీలకు పోతుండారో ఏమో తల్లా... ఆ అమ్మానాయిన్లు ఎట్ట గమ్మునుంటుండారో ఏమో ... ఈ సిన్మాలు, ఇళ్ళల్లో టి.విలు వొచ్చిపడి పదోక్లాసు పిల్లలకు కూడా ప్రేమలయి పోయినాయి. చిన్నప్పట్నుండీ సాకిన మేనమామలకన్నా, అమ్మా నాయనకన్నా, అమ్మమ్మకన్నా ఎక్కువయిపోయినాడంటనా ఆ ఎదవ...." సుబ్బులమ్మ గొంతు చిన్నదీ కాదు, కోపమొస్తే మనిషీకాదు...

"ఎక్కడయినా అట్నే వుండాది... సిటీలల్లో అయితే ఆడపిలకాయలు ఎట్టబోతుండారో, ఎట్టొస్తుండారో తెలీంల్యా.... అదేందో క్లబ్బులంట పబ్బులంట.... ఆడ బొయి డ్యాన్సాడాలంటే వేలువేలు కావాలంట... ఈ చదువుకునే పిలకాయిలకి అన్నన్ని వేలు ఎట్టొస్తుండాయో.... ఈ యువతంతా యిట్ట ఈ దోవన బోతావుంటే రాబోయే కాలం, రాబోయే రాజ్యం ఎట్టుండబోతాయో ఏమీ తెలీడంల్యా... భయంగా వుంది....." శంకర్రెడ్డి కొడుకు మద్రాసులో ఎం.బి.ఎ చేస్తుండాడు... డబ్బులివ్వడానికి తండ్రి కోప్పడినప్పుడల్లా బయట యువత ఎట్లుందో తండ్రికి కతలు కతలుగా తెలియజెప్తుంటాడు....

"అట్నేవుంది శంకరయ్యా కాదన్లే.... సిటీలల్లో అయితే ఎవురెట్టపోయినా పట్టిచ్చుకోరు... పిలకాయిలు రేత్రి పన్నెండు గంటలకింటికొచ్చినా అడిగేదానికిల్యా. తాగతారు, డ్యాన్సు వేస్తారు.... పొద్దన్నకల్లా ఏమీ ఎరగనట్లుగా విడిపోతారు..... మనూళ్ళల్లో అట్లాటివి సరిపడ్తాయా? అందులో రాజకీయాల్లో వుండేవాళ్ళ యింట్లో నుండి ఒక్కడుగు బయటపెడితే పదహారు జతల కళ్ళు గమనిస్తా వుంటాయి. .... చానా జాగర్తగా వుండాల" తన అల్లుడు పెద్దరాజకీయ నాయకుడయిపోయాడని సుమతి తండ్రికి ఎక్కడలేని గర్వం....

"వాడు విలేకరి గాకుండా మాములోడయ్యుంటే యిట్ల పేపర్లకెక్కుండడు జగనయ్యా.... జిల్లా అంతా తెలిసిపాయ... ఎట్ట తలెత్తుకొని తిరగాలింక మీదట.... " వియ్యపురాలేమను కుంటుందో, శ్రీదేవి ఏమనుకుంటుందో, మాధవరెడ్డి బాధపడ్తాడేమో అనే పరిస్థితి దాటిపోయాడతడు. ఎవరేమనుకున్నా తన అల్లుడి పరువు, మర్యాదే యిప్పుడు పరీక్ష...

వజ్రమ్మకి కడుపులో తిప్పుతోంది.... అందరి ఎదురుగ్గా లేచి పెరట్లోని బాత్‌రూంలోకి వెళ్ళడానిక్కూడా భయంగా వుందామెకు... ఎట్లవుతుందో ఏమో.... చెంబుడు నీళ్ళు పోసుకుంటే బాగుండునన్పించి రంగమ్మని పిలిచి నీళ్ళు పెట్టమనడానిక్కూడా జంకింది. ఉబ్బిపోతున్న పొట్ట, ఉబికిపోతున్న హృదయం, నిద్రలేక వాచిపోయిన కళ్ళూ, మాసిన చీర.... ఎట్లయితే అట్లవుతుందని మెల్లిగా లేచి స్నానానికి నడిచింది వజ్రమ్మ నాలుగు దినాల తర్వాత....

హఠాత్తుగా వజ్రమ్మకి పరువు, మర్యాద అన్నమాటల మీద ఏవగింపు కలిగింది... మనిషి నాగరికత నేర్చుకునే క్రమంలో ఏర్పరుచుకున్న ఈ పిచ్చికులాల మీద, మతాల మీద కోపం రగులుతోంది... సుఖదుఃఖాలలో ఒకటిగానే వుండమని చెప్పిన శ్రీ కృష్ణుడి మీద విరక్తి కలుగుతోంది. ఆయన మాత్రం యాదవ కులంలో పుట్టలేదా? ... ఆయనకి మాత్రం ఎందుకంత ప్రతిష్ట? ... ఎవరు కనిపెట్టారీ కులం? .....సీతారామరాజు చెప్పినట్లు వాళ్ళ రక్తం కూడా మన మాదిరి ఎర్రగానే కదా వుంటుంది?...

ఈ కులాల పెళ్ళిళ్ళు జరగడం మంచిదేలే అనుకున్నా అక్కడ కూడా మళ్ళీ ఆడోళ్ళకే బాధ. పెద్ద కులంలో నుండి చిన్న కులంలోకి పోయినా, చిన్న కులంలో నుండి పెద్దకులంలోకి పోయినా అమ్మాయిల్దే తప్పు... అమ్మాయిలనే హింస పెడతారు... ఏ పని చెయ్యబోయినా "కులం జులుం చూపిస్తున్నావే' అంటారు చిన్న కులమయితే అంటరానిదానిలా చూస్తారు.. మతాలు మార్పిస్తారు.... కులం మార్చుకోమంటారు. పేరు మార్చుతారు... నీలిమయినా, సత్యబాలయినా, రోజ్‌మేరీ అయినా ఏ కాలంలో

నయినా, ఏదేశంలో నయినా ఈ కులాల పెళ్ళిళ్ళల్లో స్త్రీల మీదే పెత్తనం....

ఆలోచించి ఆలోచించి వజ్రమ్మ బుర్ర వేడెక్కిపోతుంది. ఆ సందె చీకట్లో ఒంటిమీద చల్లటినీళ్లు పడితే హాయిగా అన్పించాదామెకు. స్నానమయిందంటే అయిందన్పించి చీరమార్చుకొనొచ్చింది...

సుమతి అందరికీ రెండోసారి కాఫీలందిస్తోంది... అత్తకి మాత్రం ప్లేట్లో వేడికి అన్నమూ, కూర పెట్టుకొచ్చింది.

'వద్దు' న్నట్లుగా తలూపింది వజ్రమ్మ.

'లేదత్తా ... నా మాటిని ఈ ఒక్క ముద్దా తిని గమ్మున పడుకో' అంటూ బలవంతంగా అత్త చేత అన్నం తిన్పించింది....

షుగర్ పేషంట్లు కావడంతో తండ్రిని, మాధవరెడ్డినీ పిలిచి అన్నాలు వడ్డించింది... యింకా వచ్చిన చుట్టాల్లో కొందరిని భోజనానికి పిలిచింది వాళ్ళల్లో కొందరు యింటికి పోతామనీ, మరికొందరు మళ్ళీ తింటామని అనడంతో కౌసల్యనీ, శ్రీదేవినీ బలవంతంగా వంటగదిలోకి తీసికెళ్ళి భోజనాల ముందు కూర్చోబెట్టి .... మెల్లిగా వచ్చి వజ్రమ్మ దగ్గర కూర్చుంది.

'ప్చ్ క్లిక్ ... ప్చ్ క్లిక్ ... అయినా వజ్రం లాంటి పిల్ల ఎంత పనిచేసింది. తనలో తాను అనుకుంటున్నట్లుగా పైకే అన్నది... వజ్రమ్మకి సుమతి తనని ఎద్దేవా చేయడం లేదు గదా అన్పించింది... చిన్నప్పట్నుంచి యింట్లో అంతా నీలిమని వజ్రం అని పిలవడమే అలవాటు.... మేనమామయితే 'వజ్రం' తల్లీ అంటూ కింద పెట్టేవాళ్ళు కాదు.....ఆ అక్కసుతో సుమతి ఎత్తిపొడుస్తోందేమో అనుకుంది.

కానీ సుమతి ఆలోచనలు వేరేగా ఉన్నాయి...

భర్త తొందరపాటు తనంతో, ఆవేశంతో, పరువు మీది ప్రేమతో మరెన్ని కష్టాలురానున్నాయోనని భీతిల్లిపోతుంది. ...అంతా నీలిమని శనిబట్టిందని అంటున్నారు కానీ.... తనకే శనిపట్టినట్లుగా వుంది సుమతికి... అప్పటికీ చెప్పింది తొందరపడొద్దని, తన మాట విన్పించుకునే స్థాయిలో వున్నాడాతను.

సన్నగా చినుకులు మొదలవడంతో బయటవున్న వాళ్ళలో కొందరు లోపలికి, మరికొందరు ఎవరిళ్ళకి వాళ్ళు సర్దుకున్నారు...

"ఈ వాన కూడా యిప్పుడే రావాలా? "అనుకుంటూ పదే పదే వాకిలి కేసి చూస్తూ తండ్రికి పడకపరిచి, మిగిలినవాళ్ళకి భోజనాలు వడ్డించడానికి లేచింది....

ఇల్లంతా కలత నిద్రలలో నుండి ఒకింత గాఢ నిద్రలోకి జారుకుంటోన్న సమయం.... మామిడి కొమ్మ మీది కోయిలకి ఏకబురందిందో గానీ రెండు చివుర్లు మెక్కి మత్తుగా తూలుతోంది...

వాకిట్లో వరుసగా వున్న అశోక చెట్లు మౌనధ్యానం చేస్తోన్న మునుల్లా ఆకు కదలకుండా నిల్చుని వున్నాయి... నిశ్శబ్దానికి కూడా భయం కల్గించేంత మహానిశ్శబ్దంలో నుండి సర్రున శబ్దం చేసుకుంటూ వచ్చి జప్పున ఆగింది బొలెరో ... దాని వెనుక మరొకసుమో....

కట్లు తెంచుకున్న కోడెదూడ రంకెలేసుకుంటూ జగన్ రెడ్డి కారు వద్దకు వచ్చింది.

ముందుకారులోని వెనుక సీట్లో నుండి దిగిన జగన్ రెడ్డి అడ్డపంచె పైకి మల్లించి కట్టుకుంటూ కోడెదూడ మెడ నిమిరి... మెల్లిగా లోపలికి నడిచాడు. అతడికంటే ముందే వరండాలోకి వెళ్ళిన డ్రైవరు కాలింగ్ బెల్ నొక్కాడు అప్పటికే....

ఆ నిశ్శబ్ద కుహరంలో కాలింగ్ బెల్ మోత నిర్విరామంగా అరుస్తోన్న గుడ్ల గూబకు మల్లే వుంది.

పడమటింట్లో వజ్రమ్మ లేచి కూర్చోవడం, గదిలోపలి నుండి మాధవరెడ్డి పరుగెత్తుకు రావడం... హాల్లో పడుకున్న వాళ్ళు కంగారుగా కదలడం ఒకేసారి జరిగాయి.

శ్రీదేవి గోడకానుకుని బిక్కుబిక్కుమంటూ గుమ్మం కేసి చూస్తోంది.

సుమతి కళ్ళు నులుపుకుంటూ వెళ్ళి తలుపుతీసింది.

"ఎర్రనీళ్ళు కలుపు సుమతీ" అంటూ లోపలి కడుగుపెట్టిన జగన్ ముఖం అత్యంత గంభీరంగా వుంది. అతడి దవడ కండరాలు బిగుసుకుని ఆ పట్టుతో కదల్చకనే కదులుతున్నట్లుగా వున్నాయి.

ఆ తెల్లవారుజాము నిశ్శబ్దంలో అసలే అలసిపోయిన జగన్ మొహం భయంగానూ, ఆ కండరాల కదలిక స్పష్టంగానూ విన్పించింది. సుమతికి ... భర్త చెప్తోన్న దేమిటో అర్థంకాక అయోమయంగా అతడు గదిలోకెళ్ళేదాకా చూపుసారించి ఆ తర్వాత వాకిలికేసి తిరిగింది సుమతి.

ఒక్కడుగు వెనక్కి వేసిందామె దిగ్భ్రమతో ...

అక్కడ నీలిమ, వెంకటరమణ యిద్దరూ పూలదండలతో నిల్చుని వున్నారు... వారి చుట్టూ జగన్ రెడ్డి బృందం గ్రూప్ ఫొటోకి నిల్చున్నట్లుగా వున్నారు. ... డ్రైవరు హడావుడిగా లోపలికెళ్ళి శ్రీదేవితో ఎర్రనీళ్ళు కలిపిస్తున్నాడు. శ్రీదేవికి ఒకవైపు కంగారు గానూ, మరోవంక అయోమయంగానూ వుంది.

తనరోజు వారీ యాత్రను ముగించడానికి సిద్ధపడుతోన్న చంద్రుడు ఒక్క క్షణమాగి ఆశ్చర్యంగా ఆ బృందాన్ని చూసి చిరునవ్వు వెన్నెలలు వెదజల్లాడు.

ఏ రాజకీయ కారణాలు జగన్‌రెడ్డి చేత ఈ పెళ్లి చేయించాయో మనందరికీ తెలుసు.

"వజ్రం నా కొడుకు వజ్రం" అనుకుంది వజ్రమ్మ గర్వంగా.

★